క్లుప్తంగా

ఏపీఎంకు సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం: వెలుగు ఏపీఎం లలితకు ఉత్తమ పురస్కారం లభించడంతో బుధవారం పలువురు ఘనంగా సన్మానించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వెలుగు కార్యాలయంలో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, సీసీలు ఉమామహేశ్వరి, రంజిత్ బాబు, ఖాజామస్తాన్, వీఓఏలు పాల్గొన్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గండికోట సుధీర్‌కుమార్‌కి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తాను 77 జాతీయ ఉద్యమ ఘట్టాలు, 77 మంది ఉద్యమవీరుల కథలు, 77 మంది తెలుగు సాహితీవేత్తల రచనాశైలి, పర్యావరణ పరిరక్షణపై నినాదాలు, 77 మంది ప్రతిభామూర్తుల బయోగ్రఫీ వంటి వాటిని రచించడంతోపాటు వాటిని విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్‌ను అభినందిచారు.

ట్రాఫిక్ సిబ్బంది పనివేళల్లో మార్పులు

- ఏ, బీ, సీ షిఫ్టులతో నూతన జాబ్‌చార్ట్

నెల్లూరు(క్రైమ్): ఎండ, వాన, దుమ్ము, ధూళికి ఏకధాటిగా 8గంటల పాటు నిలబడి ట్రాఫిక్ విధుల నిర్వహణ కష్టంతో కూడుకుంది. ట్రాఫిక్ సిబ్బందికి కాస్తా ఊరట నిస్తూ పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యతో పాటు సిబ్బంది ఆరోగ్యం, పనిఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని బుధవారం నుంచి మూడు షిఫ్ట్‌ల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ట్రాఫిక్ సిబ్బందిని ఏ, బీ, సీ షిఫ్టులుగా విభజించారు. ఏ షిఫ్ట్‌లోని సిబ్బంది ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, బీ షిఫ్ట్‌లోని సిబ్బంది 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధులు నిర్వహిస్తారు. తిరిగి ఏ షిఫ్ట్ సిబ్బంది 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, బీ షిఫ్ట్ సిబ్బంది సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు విధులు నిర్వహిస్తారు. మధ్యలో ఖాళీగా ఉన్న సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా లేని కొన్ని పాయింట్లలో మాత్రమే సీ షిఫ్ట్‌లోని సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వారు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తారు. అనంతరం ఇళ్లకు వెళ్లి విశ్రాంతి తీసుకుంటారు. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహిస్తారు.

23న సినిమా పాటలు, శాస్త్రీయ నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఈ నెల 23న కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, ఏవీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సినిమా పాటలు, శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 77299 42543 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బి.రఘురామిరెడ్డి, ఎస్.వెంకారెడ్డి, కె.శ్రీనివాసులు, విశ్వేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

నెల్లూరు(టౌన్): మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. మినీబైపాస్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిషేధంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏఈఎస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల సమాజంలో గౌరవం కోల్పోవడంతో పాటు కుటుంబాలు నాశనమవుతాయని తెలిపారు. మనసు నియంత్రణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, డా.భాస్కర్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: ఒక్కో సచివాలయ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం తక్షణ సాయంగా రూ.20 లక్షలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోవూరు సచివాలయం–1 పరిధిలో బుధవారం ప్రసన్న గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలనే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అర్హతే కొలమానంగా పా ర్టీలకు అతీతంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని సచివాలయాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకే పథకాలు అందాయన్నారు. ఆ నరకం నుంచి ప్రజలు విముక్తి పొంది సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటి ముంగింటకే పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామంలో ఉన్న సచివాలయం వద్దకు వెళ్తే సమస్యలను పరిష్కరించడం జరుగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసి ప్రజలకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దార్ పద్మజ, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏడీ సతీష్, ఏఈ పరమేశ్వరలింగం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేల వితరణ

కోవూరుకు చెందిన శెట్టిపల్లి మనోజ్ఞకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేలను వితరణగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అందజేశారు. మనోజ్ఞకు తల్లిదండ్రులు లేకపోవడంతో వాళ్ల అత్త దగ్గర ఉంటోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోవూరు పూలతోట ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సమయంలో మనోజ్ఞ పరిస్థితిని తెలుసుకున్న ప్రసన్న చిన్నారికి రూ.25 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించిన బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో ఆ చిన్నారి ధన్యవాదాలు తెలిపింది.

సొసైటీ కార్యాలయానికి కాంపౌండ్ వాల్

- రూ.5 లక్షలతో నిర్మాణం



సొసైటీ కార్యాలయం చుట్టూ నిర్మించిన ప్రహరీ

పొదలకూరు: మండల సహకార పరపతి సంఘం కార్యాలయానికి దీర్ఘకాలికంగా కాంపౌండ్ వాల్ లేకపోవడంతో సమస్యగా ఉండేది. కార్యాలయం ప్రాంగణంలోకి పందులు, కుక్కలు చొరబడేవి. సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి ఇదే సమస్యను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తన పర్యవేక్షణలో ఉన్న సహకార శాఖ ద్వారా కార్యాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. వెంటనే సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దీంతో రైతులకు సౌకర్యవంతంగా మారింది.

చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: చిరుధాన్యాలు మనిషికి అనేక పోషక విలువలను అందిస్తాయని వాటి సాగుపై రైతులు దృష్టి సారించాలని నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి సూచించారు. మండల కార్యాలయంలో బుధవారం ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మారుతీదేవి మాట్లాడుతూ చిరుధాన్యాల్లో కాల్షియం, ఇనుము, ఖనిజ, లవణాలు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందన్నారు. అందుకే రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరి, వేరుశనగ, బెండ, మిరప, వంగ తదితర పంటల్లో సమగ్ర ఎరువులు, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయా పంటల సాగుకు ముందు రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలన్నారు. ఈ క్రమంలో రైతులు పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి శైలజాకుమారి, మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, వీఏఏ షర్మిల తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



అవార్డు గ్రహీతలను అభినందించిన వీసీ

వెంకటాచలం: నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నలుగురు అవార్డులు అందుకున్నారు. బుధవారం మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో వీసీ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి అభినందించారు.

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు



మాట్లాడుతున్న ఏపీజీఈఎఫ్ నాయకులు

నెల్లూరు(పొగతోట): ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం వారు ఏపీజీఈఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 జూన్ 2 నాటికి డీఎస్సీ విధానంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు, సచివాలయాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పసలేని ఆరోపణలు సోమిరెడ్డి నైజం



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): పసలేని ఆరోపణలు చేయడమే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నైజమని జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య అన్నారు. బుధవారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమిరెడ్డీ మట్టి మాఫియాపై బహిరంగ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మట్టి మాఫియాలో సోమిరెడ్డి వాటాపైన, ఆయన మంత్రిగా ఉన్న హయాంలో చేసిన అక్రమాలపైన బహిరంగ విచారణకు తాము సిద్ధమని, తమ సవాలను స్వీకరించాలని కోరారు. సోమిరెడ్డి కోటరీలోని వారంతా రౌడీషీటర్లు, దొంగలేనని, వారు చేసే సవాళ్లను తాము స్వీకరించేది లేదన్నారు.

సోమిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఏడాదిలో రైల్వేలైన్ అభివృద్ధి పేరుతో అనుమతులు తెచ్చుకుని 60 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని దోచుకున్నారని ఆరోపించారు. మంత్రిగా ఉన్నప్పుడు సోమిరెడ్డి బీసీలమైన తమని ఇబ్బందులు పెట్టారని, అప్పుడు తాము బీసీ నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీసీలు ఎప్పటికీ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లి గూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చెముడుగుంటకు మంత్రి కాకాణి రాక నేడు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట పంచాయతీ స్రిడ్స్ కల్యాణ మండపానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.45 గంటలకు అక్కడ సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహిస్తారని తెలియజేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



కోవూరు(విడవలూరు): విడవలూరు మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధిలో ఉన్న గౌరీపురంలో నుడా నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కోవూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ఆవుల వాసు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ కాపులు తదితరులు పాల్గొన్నారు.


వరి పొలాల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెంలో బుధవారం వేరుశనగ, వరి పంట పొలాలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివన్నారాయణ, ఏడీఏ విజయకుమార్, డీఆర్‌సీ ఏఓ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి తదితరులు రైతులతో మాట్లాడారు. వరిలో వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. జీవ నియంత్రణ ఎరువుల వినియోగించే విధానాలను తెలిపారు. వేరుశనగలో విత్తన శుద్ధి, విత్తన మోతాదు, జిప్సం వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో ర్యాలీ



ముత్తుకూరు: మణిపూర్ రాష్ట్రంలో హింసాకాండను ఖండిస్తూ మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముత్తుకూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కరువయ్యాయని పాస్టర్లు ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని శాంతి సామరస్యాలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

సీతారామస్వామి మందిరంలో శ్రావణమాస పూజలు

నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణమాసం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతమ్మకు ప్రతి శుక్రవారం సామూహిక కుంకుమార్చన, ఖడ్గమాల పూజలు నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా బుధవారం తెలిపారు. ఆగస్టు 18, 25, సెప్టెంబరు 1, 8,15 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆగస్టు 31న రాత్రి 7గంటలకు శ్రీవారికి గరుడసేవ, నగరోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు
- బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ సుప్రజ



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో నగర పంచాయతీ భవన నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరైనట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. బుధవారం ఆమె వివరాలు వెల్లడించారు. ఈ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే తిరిగి భవన నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ 2.0 పథకం కింద రూ.85 కోట్లను మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతోపాటు ఇప్పటి వరకు బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 78 ఎకరాలను కొనుగోలు చేసి అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేయడంతోపాటు సుమారు 1,665 మందికి ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు సహకారంలో దాదాపు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నుడా కింద బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరయ్యాయని, వీటితో ఇప్పటికే 50 శాతం పనులను పూర్తి చేశామని, త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఇలా బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించే విషయంలో చొరవ తీసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించాలి

- డ్వామా ఏపీడీ మృదుల



మనుబోలు : ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రసాద్

కొడవలూరు: జాబ్‌కార్డులు కలిగిన ఎస్సీ, ఎస్టీ కూలీలందరికీ విధిగా ఉపాధి పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటాయించిన కొలతల ప్రకారం పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎఫ్ఏలదేనన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు సోక్ పిట్స్ నిర్మించుకుంటే ఉపాధి హామీ ద్వారా రూ.6 వేలు చెల్లిస్తారన్నారు. ప్రతి లబ్ధిదారు విధిగా నిర్మించుకునేలా చూడాలని సూచించారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎక్కువ పనులు గుర్తించడం ద్వారా కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ రాజశేఖర్, టీఏ రియాజ్ పాల్గొన్నారు.

- మనుబోలు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యత ఇస్తూ ఉపాధి పనులు కల్పించాలని ఈఓపీఆర్డీ ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ రాజమ్మ, టీఏలు సుప్రజ, రమేష్, ఎఫ్ఏలు హరేంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: పారిశ్రామిక రంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్ అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని స్కూల్ విద్యార్థులకు బుధవారం అదానీ కృష్ణపట్నంపోర్టు, పంటపాళెంలోని అదానీ విల్‌మార్ కంపెనీలను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల నుంచి వచ్చే ఉత్పత్తులు, వాటికి ఉన్న డిమాండ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తామన్నారు. డాక్టర్ రమేష్‌బాబు, మహేష్, విశాల్‌కుమార్ పాల్గొన్నారు.

డీఎల్‌డీఏ డైరెక్టర్ చేయూత



నగదు అందజేస్తున్న దృశ్యం

కోవూరు: మండలంలోని పడుగుపాడు నేతాజీనగర్‌లో నివాసముంటున్న నిరుపేద గిరిజన కుటుంబానికి డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి చేయూతనందించారు. నేతాజీనగర్ గిరిజన కుటుంబానికి చెందిన రిక్షా కార్మికుడు తూపిలి వెంకటరమణయ్య గుండెపోటుతో బుధవారం ఉదయం మరణించాడు. ఈ నేపథ్యంలో దహన సంస్కారాలకు కూడా డబ్బుల్లేవన్న విషయాన్ని దినేష్‌రెడ్డికి తెలిసింది. ఆయన వెంటనే స్పందించి రూ.10 వేలను ఆ కుటుంబానికి పంపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కవరగిరి శ్రీలత, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బాబురావు, వార్డు సభ్యులు నాగమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ

కోవూరు: స్థానిక ఎస్సైగా పనిచేస్తున్న దాసరి వెంకటేశ్వరరావుకు సీఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కోవూరు మండలంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

ముత్తుకూరు: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం జరుగుతుందని ఎంపీడీఓ ప్రత్యూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

'వీఓఏ మాకొద్దు'



వివరాలు తెలుపుతున్న సంఘ బంధం సభ్యులు

కోవూరు: సభ్యులను వేధిస్తున్న వీఓఏ వెంకట లక్ష్మి తమకొద్దని, ఆమె స్థానంలో మరొకరిని నియమించుకుంటున్నట్లు గుమ్మళ్లదిబ్బ సంఘ బంధం సభ్యులు తీర్మానం చేసినట్లు తెలిపారు. గ్రామంలో సంఘ బంధంలోని వంద మంది ఎస్సీ సభ్యులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏగా వెంకటలక్ష్మి సమావేశాలను సభ్యుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఇంటి వద్ద నిర్వహిస్తోందని చెప్పారు. ఆ సమయంలో ఆమె భర్త మద్యం తాగొచ్చి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా సభ్యులు ఏ రుణం తీసుకున్నా వీఓఏ వెంకట లక్ష్మి లంచం డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా ఆమెను తొలగించి కొత్త వారిని నియమించుకోవాలని తీర్మానం చేసుకున్నామని వివరించారు. సమావేశంలో సంఘ బంధం అధ్యక్ష, కోశాధికారులు వై.మమత, బుజ్జమ్మ, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.